# సాక్షి అనంతపురం

బుధవారం । 2 । ఏప్రిల్ । 2025




**చీనీ టన్ను రూ.26,530**

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.26,530 పలికాయి.



**టమాట కిలో రూ.8**

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.8 పలికింది. కనిష్టం 5, సరాసరి రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
40.4°/21.8°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవి తాపం అధికంగా ఉంది. ఆగ్నేయం దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

## న్యూస్‌రీల్

### కూటమి సర్కార్ కక్ష సాధింపు

- ఇటీవల మాజీ ఎమ్మెల్యే విశ్వతో సహా 16 మందిపై అక్రమ కేసులు
- తాజాగా పోలీసుస్టేషన్‌కు పిలిచి విచారణ



వైఎస్సార్‌సీపీ నాయకులతో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

**ఉరవకొండ:** ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలిపిన వైఎస్సార్‌సీపీ నేతలపై కూటమి సర్కార్ కక్ష సాధింపు చర్యలకు దిగింది. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ గత ఏడాది డిసెంబర్ 27న పోరుబాట పేరుతో ఉరవకొండలో వైఎస్సార్ సీపీ నేతలు నిరసన ర్యాలీ చేపట్టారు. విద్యుత్ శాఖ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి ఏడీ భాస్కర్‌కు వినతి పత్రం అందించారు. పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, ప్రజలు కదం తొక్కడంతో ర్యాలీ గ్రాండ్ సక్సెస్ అయింది. ఈ క్రమంలో దీన్ని జీర్ణించుకోలేని కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వర రెడ్డితో పాటు 16 మంది పార్టీ ముఖ్య నేతలపై కేసులు బనాయించింది. అప్పట్లో టీడీపీ ముఖ్య నేతలు విద్యుత్ శాఖ ఏడీపై ఒత్తిడి తెచ్చి వైఎస్సార్‌సీపీ నాయకులు తమ విధులకు ఆటంకం కల్గించారని, దూషించారంటూ ఆయనతో తప్పుడు ఫిర్యాదు చేయించారు. ఈ క్రమంలో మంగళవారం వైస్ ఎంపీపీ ఈడిగ ప్రసాద్, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, పార్టీ నాయకులు లత్తవరం గోవిందులను ఉరవకొండ అర్బన్ సీఐ మహానంది స్టేషన్‌కు పిలిపించి విచారణ చేపట్టారు. అక్రమ కేసులతో తమను ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా ధైర్యంగా, న్యాయబద్ధంగా ఎదుర్కొంటామని ఈ సందర్భంగా పార్టీ నాయకులు తెలిపారు.

### దగ్గుపాటి అనుచరుల బరితెగింపు



రోడ్డుకు అడ్డంగా తాడుకట్టి టోల్ వసూలు చేస్తున్న ఎమ్మెల్యే అనుచరులు

**అనంతపురం రూరల్:** అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి అనుచరులు బరితెగించారు. ప్రజల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడ్డారు. ఉగాది, రంజాన్ పండుగల అనంతరం వినోదం కోసం అనంతపురం సమీపంలోని శిల్పారామానికి ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. అలా వచ్చే వారి వాహనాల పార్కింగ్ కోసం శిల్పారామం పక్కనే స్టాండ్ ఏర్పాటు చేసి ఒక రోజు టోల్ వసూలు చేసుకోవడానికి ఇటీవల టెండర్ నిర్వహించగా.. రాజీవ్‌కాలనీకి చెందిన ఎమ్మెల్యే అనుచరులు దక్కించుకున్నారు. అయితే, స్టాండ్‌లో పెట్టిన వెహికల్స్‌కు మాత్రమే టోల్ వసూలు చేయాలనే నిబంధన ఉన్నా పట్టించుకోలేదు. మంగళవారం శిల్పారామంకు కిలోమీటర్ దూరంలోనే రోడ్డుకు అడ్డంగా తాడు కట్టి మరీ డబ్బు వసూలు చేశారు. 'తాము స్టాండ్‌లో వాహనాలు పెట్టలేదు.. ఎందుకు టోల్ కట్టాలి' అంటూ కొంతమంది నిలదీసినా ప్రయోజనం లేకుండా పోయింది. 'ఎక్కడ వెహికల్స్ పెట్టినా డబ్బివ్వాల్సిందే.. లేదంటే బండ్లకు గాలి తీసేస్తాం' అంటూ బెదిరించడంతో చేసేది లేక చెల్లించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. నిబంధనలకు విరుద్ధంగా ఎమ్మెల్యే అనుచరులు అక్రమ వసూళ్లు చేసినా అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదని ప్రజలు మండిపడ్డారు.

### భూ సేకరణ త్వరితగతిన పూర్తవ్వాలి

- జేసీ శివ్ నారాయణ్ శర్మ

**అనంతపురం అర్బన్:** జిల్లాలో చేపడుతున్న ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. జేసీ మంగళవారం కలెక్టరేట్ నుంచి డివిజన్, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 544–డీ పనులు వేగవంతం చేయాలన్నారు. రీ–సర్వే చేపట్టిన 31 పైలెట్ గ్రామాల్లో అన్ని ప్రక్రియలు పూర్తి చేయాలన్నారు. భూ యజమానుల నుంచి అభ్యంతరాలు వస్తే విచారణ చేసి పరిష్కరించాలని చెప్పారు. రెండోదశలో 62 గ్రామాల్లో చేపట్టిన సర్వే పనులు వేగవంతం చేయాలన్నారు. గ్రామ, బ్లాక్, ప్రభుత్వ భూముల సర్వే పూర్తి చేయాలన్నారు. ఎండల నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని సర్వే శాఖ ఏడీ రూప్లానాయక్‌ను ఆదేశించారు. 'ఐవీఆర్ఎస్' ద్వారా వీఆర్‌ఓ, గ్రామ సర్వేయర్ల పనితీరు పరిశీలిస్తామని, పనితీరు సరిగాలేని వారిపై చర్యలు ఉంటాయని చెప్పారు.

# వరమివ్వని ఉద్యానం

'గ్రోత్ ఇంజిన్లు'గా చెప్పుకునే అరటి, చీనీ, టమాట, మిర్చి, మామిడి పంటలు ఈ ఏడాది ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. లక్షలాది రూపాయల పెట్టుబడితో సాగు చేసిన పంటలు కన్నీళ్లే మిగిల్చాయి. పంట పండితే ధరలు లేవు, ధరలుంటే పంటలు పండవు అన్నట్లుగా పరిస్థితి తయారైంది. గతంలో ఎన్నడూ లేనంతగా అరటి, మిర్చి, టమాట రైతులు దారుణమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు.



ఇటీవల ఈదురుగాలులకు పుట్లూరు మండలం జంగంరెడ్డిపేటలో దెబ్బతిన్న అరటి తోటలో దిగాలుగా రైతు మహేశ్వరరెడ్డి (ఫైల్)

- 'గ్రోత్ ఇంజిన్' పంటల సాగు రైతులకు ఈ ఏడాది భారీ నష్టాలు
- మిర్చి, టమాట పంటలకు గిట్టుబాటు ధరల్లేక కుదేలు
- అరటి ధరలు పడిపోయి ఆవేదన
- చీనీ రైతులకూ చేదే..
- మామిడి మీద ఆశలున్నా.. ముందు ముందు ఎలా ఉంటుందోనని భయం



అనంతపురంలోని చీనీ మార్కెట్

**సాక్షి ప్రతినిధి, అనంతపురం:** ఉద్యాన రైతులకు ఎక్కడా ఊరట లభించడం లేదు. అరటి రైతులైతే ఈ ఏడాది దారుణంగా దెబ్బతిన్నారు. పెట్టుబడులు పెరగడం, ధర తగ్గడంతో నష్టాలు ఎదుర్కొంటున్నారు. ఒక దశలో రూ. 25 వేలు పలికిన టన్ను అరటి.. నేడు రూ.11 వేలు కూడా లేదు. రైతులేమో ఎకరాకు రూ. లక్షన్నర వరకూ పెట్టుబడి పెట్టారు. చాలా చోట్ల దిగుబడి బాగా వచ్చినా ధరల్లేక నిరాశే మిగులుతోంది. వాస్తవానికి జిల్లాలో పండే 'గ్రాండ్ నైన్ అరటి'కి అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి ధర లభిస్తున్నా ఎగుమతి సౌకర్యం లేకపోతోంది.

**మిరప, టమాట రైతుల కన్నీళ్లు**

మిరప, టమాట రైతులను కదిలిస్తే కన్నీటి గాథ బయటికొస్తోంది. మార్కెట్‌లో ప్రస్తుతం పచ్చి మిర్చి కేజీ రూ.20 లేదా రూ.30 కంటే ఎక్కువ లేదు. కేజీ కనీసం రూ.40 పలికితేనే రైతుకు గిట్టుబాటవుతుంది. రిటైల్ మార్కెట్‌లోనే రూ.20 ఉంటే రైతు పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇక టమాట రైతులకు అప్పులే మిగులుతున్నాయి. గడిచిన నాలుగు నెలలుగా కిలో టమాట రూ.10 కంటే ఎక్కువ పలకడం లేదు. ఎరువులు, పురుగుమందు ఖర్చులు కూడా రాలేదని రైతులు వాపోతున్నారు.

**చీనీ రైతులకు చేదు గుళికలే..**

రాష్ట్రంలోనే అత్యధికంగా చీనీ దిగుబడి జిల్లాలో ఉంటుంది. చీనీ టన్ను ఇటీవల కాలంలో రూ.20 వేలు మించి పలకడం లేదు. 2021 కరోనా అనంతరం టన్ను లక్ష రూపాయలు అమ్మిన సందర్భాలు కూడా ఉన్నాయి. అలాంటిది నేడు రూ.20 వేలు ఉందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అంచనా వేయొచ్చు. మరోవైపు.. మామిడి ప్రస్తుతానికి పూత, పిందె వస్తున్నా.. వచ్చే రోజుల్లో నిలబడగలదా అన్న భయం రైతుల్లో నెలకొంది.

**ఇటీవల జరిగిన హార్టికల్చర్ కాంక్లేవ్‌లో ఇచ్చిన పంటల సాగు, దిగుబడి వివరాలు**

| పంట | సాగు (హెక్టార్లలో) | దిగుబడి (లక్షల మెట్రిక్ టన్నుల్లో) |
|---|---|---|
| అరటి | 10,946 | 6.02 |
| మిరప | 14,177 | 0.71 |
| టమాట | 16,618 | 8.30 |
| మామిడి | 10,128 | 0.56 |
| చీనీ | 38,186 | 5.21 |

**ప్రభుత్వమే ఆదుకోవాలి**



రెండు ఎకరాల్లో టమాట పంటను సాగు చేశా. సుమారు రూ. లక్ష పెట్టుబడి పెట్టా. గిట్టుబాటు ధర లేకపోవటంతో పంటను తోటలోనే వదిలేశా. టమాట పంటకు మద్దతు ధర ప్రకటించి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

– బసవరాజు, దొడగట్ట, కళ్యాణదుర్గం

**మార్కెటింగ్ సౌకర్యం లేదు**



2 ఎకరాల్లో అరటి సాగు చేశా. ఎకరాకు రూ. లక్ష చొప్పున రెండు లక్షల వరకూ పెట్టుబడి పెట్టా. పంట ఉత్పత్తుల ఎగుమతులకు సరైన సౌకర్యం లేకపోవడంతో గిట్టుబాటు కావడం లేదు. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే బాగుంటుంది.

– నాగరాజు, పెద్దజలాలపురం గ్రామం, శింగనమల మండలం

### చల్లటి కబురు



**అనంతపురం అగ్రికల్చర్/ బుక్కరాయ సముద్రం:** జిల్లా వాసులకు భారత వాతావరణశాఖ చల్లటి కబురు వినిపించింది. ఈనెల 4, 5, 6 తేదీల్లో జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు పేర్కొంది. ఈ మేరకు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం మెట్ట వ్యవసాయం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎల్.మాధవీలత, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి మంగళవారం విడుదల చేసిన బులెటిన్‌లో తెలిపారు. ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన మోస్తరు నుంచి తేలికపాటి వర్షం పడవచ్చన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 36 నుంచి 38.5 డిగ్రీలు, కనిష్టం 24 నుంచి 25.1 డిగ్రీల మధ్య నమోదు కావొచ్చన్నారు. గాలిలో తేమశాతం ఉదయం 68 నుంచి 71, మధ్యాహ్నం 15 నుంచి 43 మధ్య రికార్డు కావొచ్చని తెలిపారు. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 7 కిలోమీటర్ల వేగంతో వీస్తాయన్నారు. వర్షసూచన నేపథ్యంలో రైతులు, జీవాల పెంపకం దారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉద్యాన తోటలు గాలికి దెబ్బతినకుండా ఊతకర్రలు పెట్టుకోవాలని సూచించారు. నేల ఉష్ణోగ్రత తగ్గించుకునేందుకు ఎండిన ఆకులు, వరి గడ్డి, సేంద్రియ పదార్థాలను మొక్కల చుట్టూ ఆర్గానిక్ మల్చింగ్ విధానం పాటించాలన్నారు. వేసవిలో లోతుగా దుక్కులు చేసుకుంటే ఖరీఫ్‌లో పంటలకు మేలు కలుగుతుందని తెలిపారు.

### నేడు కలెక్టరేట్ ఎదుట 'ఫ్యాప్టో' ధర్నా

**అనంతపురం ఎడ్యుకేషన్:** అనంతపురం కలెక్టరేట్ ఎదుట బుధవారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్నారు. మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు జరిగే ధర్నాకు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు తరలిరావాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఆర్.శ్రీనివాస్ నాయక్, సెక్రటరీ జనరల్ పురుషోత్తం పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన పీఆర్సీ, ఐఆర్, డీఏ, సరెండర్ లీవ్స్, సీపీఎస్ ఉపాధ్యాయుల అరియర్స్ వంటి మొండి బకాయిల సాధన, విద్యారంగ సమస్యలపై రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి కార్యాచరణ

- కలెక్టర్ వినోద్‌కుమార్

**గుమ్మఘట్ట:** వేసవిలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. మండలంలోని తాళ్లకెర గ్రామంలో మంగళవారం కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పింఛన్లను పంపిణీ చేశారు. పింఛన్ లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక వీరభద్రస్వామి ఆలయం వద్ద ప్రజల నుంచి 45 అర్జీలను స్వీకరించారు. ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని కలెక్టర్‌ను కాలనీ వాసులు కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యను అధిగమిస్తున్నట్లు తెలిపారు. నీటి నాణ్యత పరీక్షలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు.



తాళ్లకెరలో పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

సీసీ రోడ్లు, డ్రైనేజీలకు రూ. 1.47 కోట్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే కాలవ తెలిపారు. అనంతరం ఉపాధి హామీ పథకం కింద పశువుల నీటి తొట్టి నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సలీంబాషా, జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, డీపీఓ నాగరాజు నాయుడు, పర్యాటక శాఖ అధికారి జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలి

**అనంతపురం అర్బన్:** ''జిల్లాలో రానున్న మాసాల్లో వేసవి తీవ్రత పెరిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలి. ఇందుకు అవసరమైన అన్ని చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గ్రామాల్లో చేతిబోర్లు, పవర్ బోర్లను గుర్తించి తక్షణం మరమ్మతు చేయించాలన్నారు. అనంతపురంలో 38 చేతిపంపులు, 44 పవర్‌బోర్లు పనిచేయడం లేదని నివేదిక ఇచ్చారని, వాటిని పరిశీలించి మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకువాలని నగర పాలక కమిషనర్‌ను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద ఈ ఏడాది రూ.3.75 కోట్లు వేతనాల రూపంలో చెల్లించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామన్నారు. పశువులకు నీటి తొట్టెల నిర్మాణం, చెరువుల పునరుద్ధరణ, ఫారం పాండ్ల నిర్మాణం, ఫీడర్ ఛానల్ పనులకు సగటున రూ.307 వేతనం పొందే విధంగా గ్రూప్ మార్కింగ్ ఇచ్చి పనులు చేపట్టాలన్నారు. సమావేశంలో డీపీఓ నాగరాజునాయుడు, జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, డ్వామా పీడీ సలీంబాషా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కొనలేక 'కంది'పోతున్నారు!

- మూడు నెలలుగా రేషన్ దుకాణాలకు అందని కందిపప్పు
- 6.60 లక్షల మంది కార్డుదారులకు మొండిచెయ్యి
- పేదలపై భారం మోపిన బాబు సర్కారు



అనంతపురంలోని ఓ రేషన్ దుకాణం వద్ద క్యూలో కార్డుదారుల పడిగాపులు

**అనంతపురం అర్బన్:** చంద్రబాబు సర్కారు పేదలకు చుక్కలు చూపుతోంది. గత ప్రభుత్వంలో అమలైన ఇంటింటికీ రేషన్ పంపిణీ పక్కన పెట్టేసి కష్టాలు తెచ్చిపెట్టింది. పనులు వదులుకుని గంటల తరబడి రేషన్‌దుకాణాల వద్ద పడిగాపులు కాయిస్తోంది. ఈ క్రమంలోనే నిత్యావసర సరుకుల్లోనూ కోత పెడుతూ భారం మోపుతోంది. మూడు నెలలుగా జిల్లాకు కందిపప్పు సరఫరా చేయకపోవడమే ఇందుకు నిదర్శనం. జిల్లాలోని 6.60 లక్షల కార్డుదారులకు కేవలం బియ్యం, చక్కెర పంపిణీతో సరిపెడుతున్నారు. కందిపప్పు ఎందుకివ్వడం లేదంటూ డీలర్లను కార్డుదారులు అడిగితే 'ప్రభుత్వం నుంచి రాలేదు...మేమేం చెయ్యాలి' అంటూ సమాధానమిస్తున్నారు.

**రూ. 12.48 కోట్ల భారం**

రేషన్ దుకాణాల ద్వారా కిలో కందిపప్పు రూ.67తో కార్డుదారులకు అందించేవారు. మూడు నెలలుగా ప్రభుత్వం పంపిణీ చేయకపోవడంతో బయటి మార్కెట్‌లో కొనాల్సి వస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.130గా ఉంది. ప్రభుత్వ ధరతో పోలిస్తే కిలోపై అదనంగా రూ.63 పడుతున్నా కొనక తప్పడం లేదు. ఈ లెక్కన జిల్లాలో కార్డుదారులపై నెలకు రూ.4.16 కోట్ల చొప్పున మూడు నెలల్లో రూ.12.48 కోట్ల అదనపు భారం పడినట్లయింది.

**జిల్లాలో**

| | |
|---|---|
| చౌక ధరల దుకాణాలు | 1,645 |
| బియ్యం కార్డులు | 6,60,330 |
| జిల్లాకు కందిపప్పు అలాట్‌మెంట్ | 625 టన్నులు |
| మూడు నెలలుగా సరఫరా చేసింది | 0 |
| కార్డుకు కందిపప్పు | 1 కిలో |
| ప్రభుత్వ ధర కిలోకు | రూ.67 |
| మార్కెట్‌లో కందిపప్పు ధర | రూ.130 |

**మూడు నెలలుగా ఇవ్వలేదు**

మూడు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదు. ప్రభుత్వం నుంచి రాలేదని డీలర్ చెప్పాడు. మా ఇంట్లో నలుగురం ఉన్నాం. నెలకు కిలో కందిపప్పు సరిపోతోంది. స్టోర్‌లో రూ.67తో ఒక కిలో కందిపప్పు ఇచ్చేవారు. అక్కడ ఇవ్వకపోడంతో మార్కెట్‌లో రూ.130తో కొనుగోలు చేస్తున్నాం.

– సత్యనారాయణ, మారుతీనగర్, అనంతపురం

**ప్రభుత్వం సరఫరా చేయలేదు**

జిల్లాకు ప్రభుత్వం కందిపప్పు సరఫరా చేయలేదు. వచ్చిన వెంటనే కార్డుదారులకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటాం. మిగులు సరుకును సర్దుబాటు చేస్తూ కొన్ని చోట్ల అందిస్తున్నాం.

– రమేష్‌రెడ్డి, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల సంస్థ



కాసేపు 'ఆప్'పోదాం..

## ఓ పనైపోయింది బాబు



**యాహూ..:** అనంతపురంలోని ఓ సెంటర్ వద్ద పరీక్ష ముగిసిన ఆనందంలో విద్యార్థులు

**అనంతపురం ఎడ్యుకేషన్:** పదో తరగతి పరీక్షలు ముగిశాయి. మార్చి 17న ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి. చివరిరోజు మంగళవారం జరిగిన సాంఘిక శాస్త్రం పరీక్షకు మొత్తం 31,200 మంది విద్యార్థులకు గాను 30,800 మంది హాజరయ్యారు. 400 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో విద్యాశాఖ అధికారులు సంతోషం వ్యక్తం చేశారు.ఏడాదంతా కష్టపడి చదివి తొలిసారి పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు.


**కేంద్రాల వద్ద కేరింతలు..**

సాంఘిక శాస్త్రం పరీక్ష ముగియగానే విద్యార్థులు కేరింతలు కొట్టారు. రెసిడెన్షియల్ స్కూళ్లల్లో చదువుతున్న వారు ఊళ్లకు బయలుదేరి వెళ్లారు.

## కన్నీటి పరీక్ష

- తండ్రి మరణం.. విషాదాన్ని దిగమింగుకుని పరీక్షకు హాజరైన విద్యార్థిని





పదో తరగతి సోషల్ పరీక్షకు హాజరైన యామిని, పరీక్షా కేంద్రంలో రోదిస్తున్న విద్యార్థిని

**ఉరవకొండ:** తండ్రి మరణించాడన్న విషాదాన్ని దిగమింగుకుని పుట్టెడు దుఃఖంలోనూ పదో తరగతి పరీక్షకు మంగళవారం విద్యార్థిని యామిని హాజరైంది. వివరాలు... ఉరవకొండ పట్టణానికి చెందిన లక్ష్మీకాంత నాయుడు లారీ ఓనర్. రెండు రోజుల క్రితం మిర్చి లోడు తీసుకుని కర్ణాటకకు వెళ్లాడు. మంగళవారం మిర్చి అన్‌లోడు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా ఛాతిలో నొప్పి రావడంతో అక్కడే కుప్పకూలి మృతి చెందాడు. లక్ష్మీకాంత నాయుడుకు భార్య పుష్పలత, పదో తరగతి చదువుతున్న కుమార్తె యామిని ఉన్నారు. అతను మరణించాడని తెలుసుకున్న భార్య, కుమార్తె విషాద సాగరంలో మునిగిపోయారు. అంతటి దుఃఖంలోనూ యామిని ఉరవకొండ ప్రభుత్వ బాలికల పాఠశాలలో నిర్వహించిన సోషల్ సబ్జెక్టు పరీక్షకు హాజరైంది. పరీక్ష ముగిసిన తర్వాత ఏడుస్తూ ఆమె ఇంటికి వెళ్లడం.. చూసిన వారిని కంటతడి పెట్టించింది.

## క్లుప్తంగా

### జోరుగా గ్రామీణ క్రీడా పోటీలు



ఇరుసు ఎత్తుతున్న యువకుడు

శింగనమల: ఉగాది పండుగను పురస్కరించుకుని మంగళవారం శింగనమలలోని నల్లమ్మ దేవాలయం వద్ద ఇరుసు ఎత్తే పోటీలు నిర్వహించారు. పోటీల్లో నాగలాపురానికి చెందిన ఫణీంద్ర మొదటి స్థానాన్ని దక్కించుకున్నాడు. రెండో స్థానంలో పామిడి మండలం వంకరాజు కాలువ గ్రామానికి చెందిన నరేష్ నిలిచాడు. విజేతలను అభినందిస్తూ నగదు పురస్కారాలతో ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.

### రైలు నుంచి జారిపడి యువకుడి దుర్మరణం

అనంతపురం సిటీ: స్థానిక జీఆర్పీ పరిధిలోని గార్లదిన్నె- తాటిచెర్ల మార్గమధ్యంలో రైలు నుంచి జారిపడి ఓ యువకుడు (30) మృతి చెందాడు. మంగళవారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో జీఆర్పీ ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి జేబులో యాదగిరి నుంచి యశ్వంత్‌పూర్ వెళ్లే రైల్వే జనరల్ టికెట్‌ను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. ప్రమాదానికి కారణం తెలియాల్సి ఉంది. మృతుడు ఎరుపు, నీలం గీతలు కలిగిన పసుపు రంగు ఆఫ్ టీ షర్ట్, లైట్ సిమెంట్ రంగున్న షర్ట్, మెరూన్ రెడ్ కలర్ ఉన్న ఫుల్ అండర్‌వేర్ ధరించాడని, ఎత్తు 5.5 అడుగులు, ఛామన ఛాయ రంగు, ఎడమ చేతికి పి.మహి అని, కుడి చేతిపై ఎంఎస్ అనే ఆంగ్ల అక్షరాలు పచ్చబొట్టు వేయించుకున్నాడని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. లవ్ సింబల్ సహా ఓం అనే సింబల్ పచ్చ రంగు టాటూ కూడా చేతిపై ఉందన్నారు. ఆచూకీ తెలిసిన వారు :94406 27662 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

### ఉంతకల్లులో నగదు చోరీ

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లు గ్రామంలో చోరీ జరిగింది. నిందితుడిని స్థానికులు బంధించారు. వివరాలు.. గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు సోమవారం మృతి చెందడంతో రాత్రి మృతదేహం వద్ద భజన చేసేందుకు తలారి వన్నూరుస్వామి వెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లో భార్య అనంతమ్మ ఒక్కతే నిద్రిస్తోంది. విషయాన్ని గుర్తించిన అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అర్ధరాత్రి సమయంలో ఇంట్లోకి చొరబడి బీరువాపై ఉన్న తాళాలు తీసుకుని తలుపులు తెరిచి రూ.50వేలు అపహరించుకెళ్లాడు. కాసేపటి తర్వాత మళ్లీ ఇంట్లోకి చొరబడిన అదే వ్యక్తి బీరువాలో నగదు తీస్తుండగా అనంతమ్మ మేలుకువ కావడంతో గమనించి కేకలు వేసింది. దీంతో అప్రమత్తమైన చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని వ్యక్తిని నిర్బంధించారు. చోరీ చేసిన డబ్బు వెనక్కు ఇవ్వాలని గ్రామస్తులు తెలపడంతో ఇంట్లో ఉన్నాయని, ఉదయాన్ని తెచ్చిస్తానంటూ తెలిపాడు. దీంతో ఇద్దరికీ స్థానికులు సరిచెప్పి పంపారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు బాధితులు తెలిపారు.

# యమ డ్రింకరులు



- ఇటీవల కలెక్టర్ కార్యాలయం ఎదుట అతి వేగంగా బైక్ నడుపుతూ ఓ యువకుడు అదుపు తప్పి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్తున్న సమయంలో మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయాడు. అయితే అతిగా మద్యం సేవించి ద్విచక్ర వాహనాన్ని నడపడమే ప్రమాదానికి కారణంగా తేలింది.
- కొన్ని రోజుల క్రితం అనంతపురంలోని గుత్తి రోడ్డులో ఉన్న ధాబాలో స్నేహితులు బర్త్‌డే పార్టీ జరుపుకున్నారు. పార్టీ ముగించుకుని ఇంటికి తిరుగు ప్రయాణమైన ఓ యువకుడు మద్యం మత్తులో ద్విచక్ర వాహనాన్ని వేగంగా నడుపుతూ డివైడర్‌ను ఢీకొని దుర్మరణం పాలయ్యాడు.

... కేవలం ఈ రెండు ఘటనలే కాదు... రోజూ జిల్లా వ్యాప్తంగా ఎక్కడో ఓ చోట మద్యం మత్తులో వాహనాలు తోలుతూ ప్రమాదాలకు కారణమవుతున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. ఇలాంటి ఘటనల్లో వాహనచోదకులు అకాల మృత్యువాత పడడంతో ఆయా కుటుంబాల్లో చీకట్లు అలుముకున్నాయి.

- జిల్లాలో నానాటికీ పెరుగుతున్న డ్రంకెన్ డ్రైవ్ కేసులు
- మద్యం మత్తులో రోడ్డెక్కడంతో ప్రమాదాలు
- చనిపోతూ, మరికొందరి మృతికి కారణమవుతున్న వైనం
- మూడేళ్లలో 2,169 డ్రంకెన్ డ్రైవ్ కేసులు
- జైలు శిక్షలు పడుతున్నా.. యువతలో కనిపించని మార్పు

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో రోజూ ఎక్కడో చోట మద్యం మత్తులో ప్రమాదాలు చోటు చేసుకుని మరణాలు సంభవిస్తున్నాయి. మద్యం తాగడం ఎంత హానికరమో వివరించే ప్రచార చిత్రాలు చాలా చోట్ల కనిపిస్తుంటాయి. పోలీసులు కూడా వివిధ ప్రచారాల మాధ్యమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. అయినా ఇవి మద్యం ప్రియుల్లో మార్పు తీసుకురాలేకపోతున్నాయి. పండుగలు, ఉత్సవాలు, శుభకార్యాల పేరుతో మందుబాబులు తెగ తాగేస్తున్నారు. అదే సమయంలో వాహనాలతో రోడ్ల పైకి రావడం ముప్పు తెస్తోంది. ఇటీవల పోలీసులు చేపట్టిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 20 నుంచి 35 సంవత్సరాల మధ్య యువకులే అత్యధికంగా పట్టుపడడం గమనార్హం. 40 నుంచి 55 ఏళ్ల వయసు వారు తర్వాత స్థానంలో ఉన్నారు. ఇటీవల 18 నుంచి 22 సంవత్సరాల మధ్య వయసు వారు కూడా అధికంగానే మద్యం సేవించి తనిఖీల్లో పట్టుబడుతున్నట్లు పోలీసుల రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.

**ఆధారపడ్డవారు అంధకారంలో**

మద్యం సేవించి వాహనాలు నడపటం ప్రమాదకరమని జిల్లాలో నిత్యం ఎక్కడో చోట పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. అయినా వీటిని యువత లెక్క చేయడం లేదు. ఎంతో భవిష్యత్తు ఊహించుకున్న కన్నవారు ఊహించలేని పరిస్థితిలోకి వెళ్లిపోతున్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ చివరకు తగిన మూల్యం చెల్లించుకుంటున్నారు. వారిపై ఆధారపడిన వారిని అంధకారంలోకి నెట్టేస్తున్నారు. జిల్లాలో ఏటా డ్రంకన్ డ్రైవ్ కేసులు పెరుగుతూనే ఉన్నాయి. దొరికిన కొందరు కొన్ని రోజుల పాటు జైలు శిక్ష అనుభవించి, బయటకు వచ్చిన తర్వాత తిరిగి తమ పంథాను కొనసాగిస్తుండడం గమనార్హం. గత మూడేళ్లలో 2,169 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు కావడమే ఇందుకు నిదర్శనం.

**జరిమానా.. జైలు**

మద్యం తాగి వాహనం నడపడం చట్టరీత్యా నేరమని అందరికీ తెలిసిన విషయమే. మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడితే భారీ జరిమానాలు, జైలు శిక్ష వేస్తారని కూడా మందుబాబులు తెలుసుకోవాలి. మొదటి సారి పట్టుబడితే రూ.10 వేల వరకు జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష విధిస్తారు. రెండో సారి అదే తప్పు చేస్తే రూ.15 వేల వరకు జరిమానా, రెండు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తారు. ఇలాంటి ఘటనల్లో ఎవరికైనా ప్రాణాప్రాయం కలిగితే జైలు శిక్ష రెండేళ్లు ఉండేది. కొత్త చట్టం ప్రకారం మద్యం తాగి వాహనం నడపడం వల్ల కలిగే ఇతరులు మృత్యువాత పడితే ఐదేళ్ల వరకు తప్పనిసరి జైలు శిక్ష విధిస్తారు. దీనికి తోడు జరిమానా కూడా భారీగానే ఉంటుంది. ఒకవేళ మృతి చెందిన వ్యక్తి మరణానికి ప్రమాదం చేసిన వ్యక్తి సరైన కారణం చెప్పకపోతే పదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు అదనపు కఠినమైన శిక్షలు విధించేలా చట్టాన్ని మార్చారు.

**కఠిన శిక్షలు ఉన్నాయి**

మద్యం తాగి వాహనాలు నడపటం చట్టరీత్యా నేరం. ప్రమాదానికి గురైతే కుటుంబీకులు ఇబ్బంది పడతారనే విషయాన్ని విస్మరించరాదు. ప్రధానంగా యువత మద్యం మత్తులో వాహనాలు నడపటం, ప్రమాదాల బారిన పడడం ఆందోళనకరం. కంటి ముందే ఎన్నో దుర్ఘటనలు జరుగుతున్నా చాలా మందిలో మార్పు రావడం లేదు. వారి విలువైన భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని కౌన్సెలింగ్‌లో సూచిస్తున్నాం. అంతేకాక డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడితే కఠిన శిక్షలు ఉంటాయి.

– కె.రఘుప్రసాద్, ట్రాఫిక్ సీఐ, అనంతపురం

### కదిలిన యంత్రాంగం



బేలోడు గ్రామంలో చిన్నారుల స్థితిగతులను ఆరా తీస్తున్న ఐసీడీఎస్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

గుమ్మఘట్ట: తల్లి మృతితో అనాథలుగా మారిన చిన్నారులను ఆదుకునేందుకు అధికారులు ముందుకు వచ్చారు. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో భాగంగా ఇటీవల బీకేఎస్ మండలం జంతలూరు వద్ద ఉన్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌లో స్వీపర్ పోస్టును దక్కినట్లుగా ఉత్తర్వులు అందుకున్న మరుక్షణమే కుప్పకూలిన బేలోడుకు చెందిన జ్యోతి (అంధురాలు).. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనతో ఆమె ముగ్గురు పిల్లలు అనాథలైన విషయాన్ని 'సంతోషం.. వెనువెంటనే విషాదం' శీర్షికన గత నెల 30న (ఆదివారం) 'సాక్షి'లో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి, సూపర్‌వైజర్ అంజినమ్మ మంగళవారం ఉదయం బేలోడుకు చేరుకుని మృతురాలు జ్యోతి కుటుంబసభ్యులను కలిశారు. చిన్నారుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలను చిల్డ్రన్స్ హోంలో చేర్పించి నాణ్యమైన భోజనంతో పాటు విద్యాబుద్ధులు చెప్పిస్తామంటూ భరోసానిచ్చారు. అయితే ఇప్పటికీ తల్లిని తలుచుకుని చిన్నారులు ఏడుస్తున్నారని, వారు కాస్త తేరుకునేంతవరకూ తమ వద్దనే ఉంచాలని అమ్మమ్మ నడిమింటి రత్నమ్మ అభ్యర్థించడంతో అధికారులు వెనుదిరిగారు.

## విద్యాశాఖ ఆడిట్‌లో 'చేతి'వాటం

- ప్రతి స్కూల్‌కు రేట్ ఫిక్స్ చేశారంటున్న హెచ్‌ఎంలు, ఎంఈఓలు
- ఆడిట్ పేరుతో చేతులు మారుతున్న రూ.లక్షలు



రికార్డులు పరిశీలిస్తున్న ఆడిట్ అధికారులు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖలో ఆడిట్ అధికారుల చేతివాటం వెలుగులోకి వచ్చింది. ఎమ్మార్సీలు, ఉన్నత పాఠశాలలకు ఓ ధర చొప్పున నిర్ణయించి మరీ వసూళ్లకు తెర తీయడం హాట్‌టాపిక్‌గా మారింది. విశ్వసనీయ సమాచారం మేరకు... దాదాపు 15 రోజులుగా విద్యాశాఖలో ఏజీ జనరల్ ఆడిట్ జరుగుతోంది. విజయవాడ నుంచి ప్రత్యేక బృందం వచ్చింది. ఎమ్మార్సీలకు మంజూరైన గ్రాంట్లు, ఎంఈఓలు ఎన్ని తనిఖీలు చేశారు, నాడు-నేడు స్కూళ్లకు మంజూరైన నిధులు, పీఎం శ్రీ స్కూళ్లకు మంజూరైన నిధులు, ఖర్చు, కోడి గుడ్లు, చిక్కీల ఇండెంట్లు, బిల్లులు, గ్రాండ్ రిజిష్టరు, ఉద్యోగులు, టీచర్ల సర్వీస్ రిజిష్టర్లు తదితర ఖాతాలను వీరు పరిశీలిస్తున్నారు. అయితే ఖాతాల పరిశీలనకు సంబంధించి ప్రతి స్కూల్‌కు రేటు ఫిక్స్ చేసి వసూళ్లకు పాల్పడడంపై కొందరు ఎంఈఓలు, హెచ్‌ఎంలు మండిపడుతున్నారు. ఇందుకోసం డీఈఓ కార్యాలయంలోని ఇద్దరు ఉద్యోగులను నియమించుకున్నారు. ఆడిట్ కోసం వచ్చిన ఎంఈఓలు, హెచ్‌ఎంలు రికార్డులన్నీ పరిశీలించిన తర్వాత వారు ఫిక్స్ చేసిన 'క్యాష్'ను సదరు ఉద్యోగికి ముట్టజెప్పాలి. రూ. వెయ్యి, రూ. 3 వేలు, రూ. 5 వేలు, రూ. 10 వేలు వరకు స్కూళ్లు, ఎమ్మార్సీలకు ఫిక్స్ చేసినట్లు ప్రచారం సాగుతోంది. ఇక డీసీఈబీ, డీఈఓ, సమగ్రశిక్ష ఏపీసీ కార్యాలయాలు అదనపు వసూళ్లు సాగిస్తున్నట్లు సమాచారం. వారు చెప్పిన మొత్తం చెల్లిస్తే ఏవీ కూడా లోతుగా పరిశీలించడం లేదని తెలిసింది. ఒక స్కూల్‌లో 20 మంది టీచర్లు పని చేస్తుంటే 4-5 మంది ఎస్‌ఆర్‌లు మాత్రమే చూసి 'అంతా ఓకే' అని సర్దిపై చేస్తున్నట్లు సమాచారం. కాగా, దాదాపు ఐదేళ్ల రికార్డుల పరిశీలనకు సంబంధించి ఆడిట్ చేసినట్లు కనీసం ఒక సంతకం కాని, సీలు కానీ వేయడం లేదు. ఇంత డబ్బు చెల్లించినా ఆడిట్ చేసినట్లు ధ్రువీకరణ లేకపోవడంతో అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే అంతా ఆన్‌లైన్ చేస్తున్నామని తర్వాత స్మార్ట్ కాపీలు వస్తాయని సర్దిచెప్పినట్లు ఓ హెచ్‌ఎం తెలిపారు. డీఈఓ కార్యాలయంలోని ఓ అధికారి వ్యవహారంపై కూడా అనుమానాలు కలుగుతున్నాయి. తమవద్ద అన్ని రికార్డులు కరెక్టుగా ఉన్నాయి సర్ అని కొందరు హెచ్‌ఎంలు ఆయన దృష్టికి తీసుకెళ్లినా ఏదో వారు అడిగినంత ఇచ్చి వెరిఫై చేయించుకోండి అంటూ ఉచిత సలహా ఇచ్చారని చెబుతున్నారు.

### 'డైట్' అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ఎడ్యుకేషన్: శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నంలోని విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. డిప్యూటేషన్ పద్ధతిలో పని చేసేందుకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు డీఈఓ ప్రసాద్ బాబు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలు https://deoananthapuramu.blogspot.com/ వెబ్‌సైట్‌లో పొందుపరిచారని, మరింత సమాచారానికి డైట్ ప్రిన్సిపాల్ లేదా అనంతపురం డీఈఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

### ఆత్మకూరు హెచ్‌ఎంపై కేసు నమోదు

ఆత్మకూరు: పరీక్ష కేంద్రంలో కేజీబీవీ పాఠశాల విద్యార్థిని శ్రావణిని కర్రతో కొట్టి ఆమె భుజపుటెముక విరిగేందుకు కారణమైన ఆత్మకూరు జెడ్పీ హెచ్ఎస్ హెచ్‌ఎం శ్రీనివాసప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం పదో తరగతి పరీక్షకు సంబంధించి ప్రశ్నపత్రాలను తీసుకెళ్లేందుకు పీఎస్‌కు చేరుకున్న ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

### అనంతలో చైన్‌స్నాచర్ బరితెగింపు



బాధితురాలు శకుంతల

అనంతపురం: నగరంలో ఓ చైన్ స్నాచర్ రెచ్చిపోయాడు. సామాజిక పింఛన్ల పంపిణీకి స్కూటీలో బయలుదేరిన ఓ సచివాలయ ఉద్యోగిని వెంటాడి, ఆమె మెడలోని బంగారం చైన్‌ను బలవంతంగా లాక్కెళ్లాడు. వివరాలు.. అనంతపురం నగరంలోని 71వ సచివాలయంలో హెల్త్ సెక్రెటరీగా పని చేస్తున్న శకుంతల మంగళవారం ఉదయమే సామాజిక పింఛన్ల పంపిణీకి స్కూటీలో బయలుదేరారు. బైపాస్ నుంచి హెచ్చెల్సీ పక్కనే ఉన్న దారిలో వెళుతున్న ఆమెను గమనించిన ఓ యువకుడు వెంబడిస్తూ నిర్మానుష్య ప్రాంతంలో తన ద్విచక్ర వాహనాన్ని అడ్డుపెట్టి అటకాయించాడు. హఠాత్పరిణామంతో ఆమె తేరుకునేలోపు మెడలోని బంగారం చైన్‌ను బలవంతంగా లాగేశాడు. దీంతో చైన్ రెండు ముక్కలైంది. తన చేతికి అందిన సగం చైన్‌తో యువకుడు అక్కడి నుంచి శరవేగంగా ఉడాయించాడు. ఘటనపై బాధితురాలు మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## విద్యుత్ ప్రమాద బాధిత కుటుంబానికి పరిహారం

- రూ.5 లక్షలు చెల్లించాలని వినియోగదారుల కమిషన్ ఆదేశం

అనంతపురం: విద్యుదాఘాతానికి గురై మరణించిన వ్యక్తి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని విద్యుత్ శాఖను అనంతపురం జిల్లా వినియోగదారుల న్యాయస్థానం అధ్యక్షురాలు ఎం. శ్రీలత ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం తీర్పు వెలువరించారు. వివరాలు... అనంతపురంలోని పిల్లిగుండ్ల కాలనీకి చెందిన సోమలూరు పుల్లయ్య బతుకు తెరువు కోసం వైఎస్సార్ జిల్లా పులివెందుల పట్టణంలో కూలి పనులకు వెళ్లాడు. ఈ క్రమంలో 2022, డిసెంబర్ 15న విద్యుదాఘాతానికి గురై చికిత్స పొందుతూ అదే నెల 18న మృతి చెందాడు. ఘటనకు సంబంధించి అప్పట్లో పులివెందుల పోలీసులు కేసు నమోదు చేశారు. భర్త మృతితో జీవనోపాధి కోల్పోయిన తమకు పరిహారం చెల్లించాలంటూ అదే సమయంలో విద్యుత్ శాఖ అధికారులను పుల్లయ్య భార్య యశోద అభ్యర్థించింది. అయితే ఈ అభ్యర్థనను విద్యుత్ శాఖ అధికారులు తిరస్కరించారు. పుల్లయ్య మృతికి ఆయన నిర్లక్ష్యమే కారణమని, ఇందులో తమకు ఎలాంటి బాధ్యత ఉండదని తిప్పి పంపారు. లీగల్ నోటీసు పంపినా ఫలితం లేకపోవడంతో బాధితురాలు అనంతపురం జిల్లా వినియోగదారుల న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో నోటీసులు అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు కమిషన్ ఎదుట హాజరై తమ వివరణ ఇచ్చారు. 11 కేవీ లైన్‌కు సంబంధించి మాత్రమే తమకు బాధ్యత ఉంటుందని, పుల్లయ్య కేసులో ఆయన నిర్లక్ష్యమే కారణమని, ఈ అంశంలో సదరు యజమానికి బాధ్యత ఉంటుంది తప్ప తమ బాధ్యత కాదని వాదనలు వినిపించారు. కేసు పూర్వపరాలు, విద్యుత్ శాఖ అభ్యంతరాలు పరిశీలించిన మీదట విద్యుదాఘాతం కేసుల్లో బాధితులకు సంబంధించి చెల్లించాల్సిన పరిహారాల నిబంధనలను అనుసరించి బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు చెల్లించాల్సిందేనంటూ జిల్లా వినియోగదారుల న్యాయస్థానం అధ్యక్షురాలు ఎం. శ్రీలత తీర్పు వెలువరించారు. తీర్పు వెలువరించిన రోజు నుంచి ఆరు శాతం వడ్డీతో సహా చెల్లించాలన్నారు. అలాగే సేవా లోపానికి రూ.10 వేలు, మనోవేదనకు రూ.10 వేలు, ఖర్చులకు రూ.3వేలు చెల్లించాలని అధ్యక్షురాలు ఎం. శ్రీలత, సభ్యులు డి. గ్రేస్ మేరీతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది.

### హత్య కేసులో నిందితుడి అరెస్ట్

హిందూపురం: లేపాక్షి వీఆర్ఏగా పనిచేస్తున్న రామాంజినప్ప(42) హత్య కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. వివరాలను హిందూపురం రూరల్ సీఐ కె.జనార్ధన్, లేపాక్షి ఎస్ఐ నరేంద్ర మంగళవారం వారు వెల్లడించారు. ఆదివారం రాత్రి తన సోదరుడు అశ్వత్థప్పతో మాట్లాడుతుండగా మిద్దెపై నుంచి కింద పడి మృతి చెందాడు. మృతుని భార్య రాధమ్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు మంగళవారం ఉదయం కల్లూరు క్రాస్ వద్ద అశ్వత్థప్పను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వలేదన్న అక్కసుతో రామాంజినప్ప తలపై బండరాయితో మోదీ, మిద్దెపై నుంచి కిందికి తోసి హతమార్చినట్లు అంగీకరించాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

## కనుల పండువగా 'లంకా దహనం'



ఒంటె వాహనంపై ఊరేగుతున్న ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తి



లంకాదహనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆలయ అధికారులు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో మూడు రోజులుగా సాగుతున్న ఉగాది ఉత్సవాలు మంగళవారం నాటి లంకాదహనం కార్యక్రమంతో ఘనంగా ముగిశాయి. రెండు గంటల పాటు సాగిన లంకా దహనం వేడుకను వీక్షించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. మంగళవారం సాయంత్రం ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తిని ఒంటె వాహనంపై కొలువదీర్చి ఆలయం నుంచి అనుబంధ దేవాలయమైన కాశీ విశ్వేశ్వరాలయం వరకూ ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ ఆలయం ఈఓ కె.వాణి, సిబ్బంది ఆధ్వర్యంలో కాశీవిశ్వేశ్వరుడికి పూజలు నిర్వహించిన అనంతరం ఆంజనేయస్వామి పల్లకీని ప్రాంగణంలో కొలువుదీర్చి వేదగోష్టి నిర్వహించారు. అయ్యప్ప క్రాకర్స్ సౌజన్యంతో సమకూర్చిన టపాసులతో దాదాపు రెండు గంటలపాటు లంకా దహనం వేడుకగా సాగింది.

### బావిలో పడి గొర్రెల కాపరి మృతి



రామాంజనేయులు (ఫైల్)

గుంతకల్లు రూరల్: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ గొర్రెల కాపరి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం నంచర్ల గ్రామానికి చెందిన ఉన్ని రామాంజనేయులు (30)కు భార్య కృష్ణవేణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. గొర్రెల పోషణతో కుటుంబాన్ని పోషించుకున్న ఆయన తన జీవాలను మేపు కోసం గుంతకల్లు మండలం కసాపురం గ్రామ సమీపంలోని పొలాల వద్దకు తోలుకు వచ్చాడు. మంగళవారం సాయంత్రం ఓ పొలంలో ఉన్న బావి వద్దకెళ్లి చేతికి అందే ఎత్తులో ఉన్న నీటిని తీసుకుంటూ అదుపు తప్పి బావిలో పడ్డాడు. నీట మునిగిన వ్యక్తి ఎంత సేపటికీ బయటకు రాకపోవడంతో అప్పటికే బావిలో ఈత కొడుతున్న పిల్లల ద్వారా విషయాన్ని తెలుసుకున్న పక్క పొలాల్లోని రైతులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కొందరు రైతులు బావిలో దూకి నీట మునిగిన రామాంజనేయులును బయటకు తీసుకువచ్చారు. అప్పటికే ఊపిరి ఆడక ఆయన మృతి చెందినట్లు నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో కసాపురం పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

## ప్రహసనంగా 'సూక్ష్మ' పరికరాల మంజూరు

- నిర్దేశిత లక్ష్యానికి దూరంలో ప్రగతి
- డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం వేలాది మంది రైతుల ఎదురు చూపు



అనంపపురం అగ్రికల్చర్: రాష్ట్రంలో కూటమి సర్కారు ఏర్పాటైన తర్వాత ప్రభుత్వ పెద్దల మాటలకు చేతలకు పొంతన లేకుండాపోయింది. కాగితాలు, మీడియాల్లో గొప్పలకు పోయిన చంద్రబాబు సర్కారు ఆచరణకు వచ్చే సరికి చేతులెత్తేస్తోంది. ఈ ఏడాది డ్రిప్, స్ప్రింకర్ల లక్ష్యాలు, సాధించిన ప్రగతే ఇందుకు నిదర్శనం. అధికారంలోకి రాగానే రాయితీతో ప్రతి రైతుకూ బిందు, తుంపర (డ్రిప్, స్ప్రింక్లర్లు) అందిస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబుతో సహా కూటమి పెద్దలు గొప్పగా ప్రకటించారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అనంతపురం జిల్లాకు ఏకంగా 42,100 హెక్టార్లలో సూక్ష్మ సేద్యం మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. దీంతో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ సూక్ష్మ సేద్యం పరికరాలు అందుతాయని 'అనంత' రైతులు సంబరపడ్డారు. అయితే కాలయాపన చేస్తూ ఏపీఎంఐపీ పథకాన్ని నత్తనడకన కొనసాగేలా చేశారు. రాను రాను టార్గెట్లు తగ్గిస్తూ వచ్చారు. ఇలా మార్చి 31న 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి 14 వేల మంది రైతులకు 17 వేల హెక్టార్లకు పరికరాలు పంపిణీ చేసినట్లు ఏపీఎంఐపీ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. దీంతో దరఖాస్తు చేసుకున్న రైతులు ఇంకా 35 వేల మందికి పైగా డ్రిప్, స్ప్రింకర్ల కోసం ఎదురుచూస్తున్నారు. బడ్జెట్ విడుదల చేయకపోవడంతో సామగ్రిని కంపెనీలు మందకొడిగా సరఫరా చేసినట్లుగా సమాచారం. ఇది చూసిన మేధావులు, రైతులు ఎక్కడ 42,100 హెక్టార్లు? ఎక్కడ 17 వేల హెక్టార్లు? టార్గెట్‌కు... సాధించిన ప్రగతికి సంబంధం లేకుండా పోయిందంటూ విమర్శలు గుప్పిస్తున్నారు.

### ఉత్సాహంగా ఉట్ల పరుష

బుక్కరాయసముద్రం: ఉగాది పండుగ సందర్భంగా బుక్కరాయసముద్రంలో మంగళవారం ఉత్సాహంగా ఉట్ల పరుష నిర్వహించారు. స్థానిక స్టేట్ బ్యాంక్ ఎదుట ఉట్ల మాను ఏర్పాటు చేసి, ఎక్కడానికి యువకులు పోటీ పడ్డారు. ఈ వేడుకను చూసేందుకు మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



ఉట్లమాను ఎక్కుతున్న యువకులు

### బాలుడిపై వీధికుక్కల దాడి



బాలుడి తొడపై లోతుగా పడిన కుక్క కాట్లు

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్లలోని గడ్డం వీధిలో మంగళవారం సాయంత్రం మూడేళ్ల బాలుడు పోతప్పపై నాలుగు వీధికుక్కలు దాడిచేశాయి. తన ఇంటి సమీపంలో బాలుడు ఆడుకుంటూ ఈ ఘటన చోటు చేసుకుంది. బాలుడు తలతో పాటు కడుపు, వీపు, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. బాలుడి అరుపులు విన్న తల్లిదండ్రులు సుంకన్న, సుజాత, కాలనీ వాసులు వెంటనే అక్కడకు చేరుకుని కుక్కలను అదిలించారు. తీవ్రంగా గాయపడిన పోతప్పను తొలుత స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం గుంతకల్లుకు, అక్కడి వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు.

# కంపెనీ నిర్వాకం.. ప్రజలకు నరకం

- 20 రోజులుగా ఏజీ అండ్ పీ ప్రథమ్ పైప్‌లైన్ పనులు
- రోడ్లను ధ్వంసం చేస్తున్న వైనం
- వాహనాల రాకపోకల బంద్
- అటువైపు తొంగి చూడని ఇంజినీర్లు



విద్యుత్‌నగర్ సర్కిల్ నుంచి నాయక్ నగర్‌కు రాకపోకలు లేకుండా ట్యాంకర్లను అడ్డుపెట్టిన దృశ్యం



రోడ్డును బ్లాక్ చేసి దృశ్యం



రోడ్డుపై ఏర్పడిన భారీ రంధ్రం

**అనంతపురం కార్పొరేషన్:** నగరంలో ఏజీ అండ్ పీ ప్రథమ్ కంపెనీ చేపడుతున్న గ్యాస్ పైప్‌లైన్ పనులతో ప్రజలు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. నగరంలో విద్యుత్‌నగర్ సర్కిల్ నుంచి నాయక్‌నగర్ మీదుగా ఆదర్శనగర్ వరకు గత 20 రోజులుగా ఒకవైపు రాకపోకలు బంద్ అయ్యాయి. దీంతో అక్కడున్న 10 వేల మందికిపైగా ప్రజానీకం రోజూ రాకపోకలు సాగించడానికి అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. అందులోనూ పైప్‌లైన్ పనులు సరిగా చేయపోవడంతో రోడ్లన్నీ ధ్వంసం చేశారు. జెలిటెన్ స్టిక్స్ వాడితే ఏవిధంగా రంధ్రాలు ఏర్పడుతాయో ఆ స్థాయిలో భారీగా రోడ్లకు రంధ్రాలు పడ్డాయి. రూ.లక్షల ప్రజాధనంతో వేసిన రోడ్లను ఏజీ అండ్ పీ ప్రథమ్ కంపెనీ సిబ్బంది ధ్వంసం చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతన్నాయి. నగరపాలక సంస్థ ఇంజినీర్లు అటువైపు తొంగి చూడడం లేదు. ఇదేమిటని ప్రశ్నించే నాథుడే కరువయ్యారు. వాస్తవంగా రోడ్డు కట్టింగ్ చేసే సమయంలో సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉంది. కనీసం అమినిటీ కూడా అటువైపు వెళ్లలేదు. రోడ్లను ఇష్టానుసారంగా కట్ చేయడంతో కాలువలు, తాగునీటి పైప్‌లైన్లు దెబ్బతినే అవకాశం లేకపోలేదు.

**ప్రజలకు తప్పని అవస్థలు..**

నాయక్‌నగర్, సెవెన్‌హిల్స్ కాలనీ, ఆదర్శనగర్, కృపానందనగర్‌కు వెళ్లే ప్రజలు విద్యుత్ నగర్ నుంచి నాయక్‌నగర్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. అక్కడ ఒకవైపు రోడ్డు బ్లాక్ చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బంది తలెత్తుతోంది. ఒక రోడ్డువైపే వాహనాలు వస్తుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. పనులు చేసే సమయంలో సౌండ్ పొల్యూషన్‌తో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఏదైనా పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. కానీ అటువంటి పరిస్థితి లేకుండా పోయింది. దీనిపై వివరణ కోరేందుకు సాక్షి యత్నించగా ఇంజినీర్లు స్పందించలేదు.

## శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం

**అనంతపురం కల్చరల్:** మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం వేదికగా శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని ఈఓ శోభారాణి తెలిపారు. రామాలయంలో విగ్రహాలను కదిలించినారన్న వార్తల నేపథ్యంలో మంగళవారం ఆలయానికి విచ్చేసిన బీజేపీ నాయకులు, భజరంగదళ్ నాయకులతో ఆమె మాట్లాడారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా శ్రీరామనవమి ఉత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. అర్చకులకు, భక్తులకు ఎటువంటి ఇబ్బందులుండకూడదనే చిన్నపాటి మరమ్మతులు చేశామని విగ్రహాలను ఎటువంటి పరిస్థితుల్లో ముట్టనివ్వలేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా భక్తమండలి ప్రతినిధులు మాట్లాడుతూ శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరుగుతుందని అందరూ భాగస్వాములు కావాలని కోరారు.



ఈఓతో మాట్లాడుతున్న హిందుత్వ సంస్థల ప్రతినిధులు

అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, జనసేన విశ్వనాథ్, భజరంగదళ్ కార్యకర్తలు ఈనెల 6న నగరంలో జరుగనున్న శ్రీరామనవమి బైక్ ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

## అలరించిన ఉగాది సంగీత విభావరి

**అనంతపురం కల్చరల్:** విశ్వావసు ఉగాది విశిష్టతను తెలియజేస్తూ జిల్లా గాయనీ గాయకులు మధుర గీతాలతో మంత్రముగ్ధులను చేశారు. ఘంటసాల సాంస్కృతిక సేవా ట్రస్టు, రామ్స్ క్లాస్ ఆర్కెస్ట్రా బోరంపల్లి రామాంజి సంయుక్త ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక హౌసింగుబోర్డులోని ఘంటసాల స్మారక మందిర ప్రాంగణంలో సంగీత విభావరి జరిగింది. ఈ సందర్భంగా డీఆర్వో మలోల, డాక్టర్ జాగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, నిర్వాహకులు ఓబుళదాసు, రామాంజి, రామయ్య మాట్లాడుతూ తెలుగువారి సంవత్సరాదిని సంగీతంతో మాసమంతా జరుపుకుంటున్నట్లు తెలిపారు. సంగీత ప్రియుల కోసం ప్రతి సందర్భాన్ని ఆహ్లాదకర వాతావరణంలో ఘంటసాల స్మారక విగ్రహం వద్ద ఔత్సాహిక గాయకులకు అవకాశాలిస్తుండడం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సందర్భంగా సీనియర్ గాయకులు పాలసముద్రం నాగరాజు, ఆచార్య సుధాకరబాబు, ఓబుళదాసు, శ్రీదేవి తదితరులు తెలుగు, హిందీ గీతాలను మధురంగా ఆలపించారు.



పాటలు పాడుతున్న గాయకులు

## పింఛన్లు సక్రమంగా పంపిణీ చేయండి

**రాప్తాడు:** సకాలంలో పింఛన్‌దారులకు పింఛన్లకు అందించాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి రామ్మోహన్ సిబ్బందికి సూచించారు. మంగళవారం హంపాపురంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. పింఛన్లు తమకు సక్రమంగా అందడం లేదని ఫిర్యాదులు వస్తే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మొదటి రోజు సిబ్బంది 95 శాతం పింఛన్లు పంపిణీ చేయడంతో వారిని అభినందించారు. ఎంపీడీఓ విజయలక్ష్మీ, ఈఓఆర్డీ ఆనంద ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



హంపాపురంలో వృద్ధులకు పింఛన్ అందిస్తున్న నియోజకవర్గ ప్రత్యేకాధికారి రామ్మోహన్

**అనంతపురం మెడికల్:** నగరంలోని 4వ రోడ్డు 63వ సచివాలయ పరిధిలో జరిగిన పింఛన్ పంపిణీని మంగళవారం కమిషనర్ బాలస్వామి పరిశీలించారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంపిణీ చేయాలని ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ 22,561 పింఛన్లకుగానూ 21,445 (95.05శాతం) పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం జేఎన్‌టీయూ, కలెక్టరేట్‌కు వెళ్లే మార్గ మధ్యంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్థంగా ఉండంపై కమిషనర్ ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి, సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులకు చురకలంటించారు. తక్షణం అక్కడ గ్యాంగ్ వర్క్ పనులు చేపట్టాలని ఆదేశించారు. చెత్త తరలింపులో ఎక్కడా కిందకు పడకుండా చూడాలన్నారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

**రాప్తాడురూరల్:** అనంతపురం రూరల్ మండలంలో సామాజిక పింఛన్లు మంగళవారం 94 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ దివాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 17,542 పింఛన్లకు గాను 16,548 మందికి రూ.7.34 కోట్లు పంపిణీ చేశామని పేర్కొన్నారు.

### పోతలయ్య స్వామికి గావులు



పోతలయ్య స్వామి గావులను తిలకిస్తున్న భక్తులు

**చెన్నేకొత్తపల్లి:** ఒంటికొండ గ్రామంలో ఉగాది పండగ సందర్భంగా మంగళవారం పోతలయ్య స్వామికి గావుల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించా. ఈసందర్భంగా ఉదయం పోతలయ్య స్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం జరిగిన గావుల కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు ఎగబడ్డారు.

### గ్రామదేవతలకు బోనాలు

**చెన్నేకొత్తపల్లి:** ముష్టికోవెల గ్రామంలో వెలసిన గ్రామదేవతలకు మంగళవారం గ్రామస్తులు జ్యోతులు, బోనాలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు జ్యోతులు, బోనాలను తలపై ఉంచుకుని ఊరేగింపుగా పెద్దమ్మ, సప్పలమ్మ దేవతల ఆలయాలకు చేరుకుని అమ్మవార్లకు సమర్పించారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**గుత్తి:** పట్టణ శివారులోని తాడిపత్రి రోడ్డులో మంగళవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుని ఇద్దరు గాయపడ్డారు. యాడికికి చెందిన శ్రీరాములు, శ్రీనివాసులు పని మీద బైక్‌లో గుత్తికి వచ్చి తిరిగి వెళ్తుండగా ఎదురుగా మరో బైక్ ఢీకొంది. ఘటనలో ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

**గుత్తి:** పట్టణంలోని బీసీ కాలనీలో ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం పట్ట పగలే చోరీ జరిగింది. గుర్తు తెలియని దొంగలు ఆలయంలోకి ప్రవేశించి, హుండీని ధ్వంసం చేసి అందులో ఉన్న సుమారు రూ. 20 వేలు నగదు అపహరించారు. ఘటనపై ఆలయ పూజారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

### ఆరుగురిపై కేసు నమోదు

**గార్లదిన్నె:** మండలంలోని కల్లూరులో బుడుగ జంగం కాలనీకి చెందిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కౌలుట్లయ్య తెలిపారు.మంగళవారం ఆయన మాట్లాడుతూ బుడుగ జంగం కాలనీలో జమ్మన్న, రామాంజనేయులు, జగన్ తమ ఇళ్లకు అమర్చుకున్న సీసీ కెమెరాలను అదే కాలనీకి చెందిన హుస్సేన్, కుపేంద్ర, సుంకమ్మ, దస్తగిరమ్మ, సాలమ్మ, సుంకమ్మ అనే ఆరు మంది సీసీ కెమెరాలను సోమవారం ధ్వంసం చేశారన్నారు. బాధితురాలు జయలక్ష్మి గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఆరుగురిపై కేసు నమోదు చేశామన్నారు.

# వైభవంగా పెద్దమ్మ జాతర



పెద్దమ్మ దేవతకు బోనాలు తీసుకెళుతున్న యువతులు, మహిళలు



ఆలయం దగ్గర కిక్కిరిసిన భక్తులు

**రాప్తాడు:** ప్రసన్నాయపల్లిలో పెద్దమ్మ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. తెల్లవారుజామున అమ్మవారికి అభిషేకాలు, కుంకుమపూజ, ఆకుపూజ, అభిషేకం తదితర పూజలు చేశారు. యువతులు, మహిళలు ప్రతి ఇంటి నుంచి అమ్మవారి కోసం చేసిన బోనాలను తలపై పెట్టుకోని డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా అమ్మవారి ఆలయం చేరుకోని బోనాలను సమర్పించి పల్లే సీమలను పచ్చదనంతో కళకళలాడే పంటలతో నింపాలని కోరుకున్నారు. ఈ ఏడాదైనా సకాలంలో మంచి వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారికి చీరలను కానుకలుగా సమర్పించారు. అనంతరం గ్రామస్తులు అమ్మవారికి జంతు బలులతో మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం యువతులు, మహిళలు, యువకులు, వృద్ధులు తారతామ్యం లేకుండా ఆనందోత్సాహలతో వసంతోత్సవం జరుపుకున్నారు. యువకులు టెంకాయలు, చీనీకాయలు, నిమ్మకాయలను విసరడం లాంటి పందేలు ఆడారు. ఆలయ ప్రాంగణం భక్తులు, అంగళ్లతో కళకళలాడింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సీఐ శ్రీహర్ష ఆధ్వర్యంలో భారీ బందోబస్తును నిర్వహించారు.



పూజలందుకుంటున్న పెద్దమ్మ దేవత

## మీ సేవలు అమూల్యం

- జేసీ శివ్ నారాయణ్ శర్మ



పదవీ విరమణ చేసిన ఉద్యోగులతో జేసీ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ మలోల

**అనంతపురం అర్బన్:** ఉద్యోగులుగా ప్రభుత్వానికి, ప్రజలకు మీరు అందించిన సేవలు అమూల్యమని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అన్నారు. పదవి విరమణ చేసి ఉద్యోగులు, అధికారులకు మంగళవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. పదవి విరమణ చేసిన వారికి జేసీ శాలువ కప్పి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శేషజీవితాన్ని ఆనందంగా గడపాలని, సామాజిక సేవ కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మలోల, తదితరులు పాల్గొన్నారు.

## కనుల పండువగా అంజన్న రథోత్సవం



పురవీధిలో రథోత్సవ శోభ

**డి హీరేహాళ్ (రాయదుర్గం):** డి హీరేహాళ్ మండలంలోని మురడిలో ఆంజనేయస్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. భక్తుల కరతాళ ధ్వనుల నడుమ గ్రామ పురవీధుల్లో స్వామి రథ చక్రాలు కదిలాయి. 'హనుమా' మము గనుమా.. అంటూ దివ్య స్వరూపుడి దర్శన భాగ్యం కోసం భక్తజనం వారది కట్టారు. వివిధ అభిషేకాలు, పూజలు, హోమాలు పూర్తిచేశాక ఆంజనేయుడి ఉత్సవ విగ్రహాన్ని వేదమంత్రోచ్చారణల మధ్య పల్లకీలో తీసుకొచ్చి రథంలో అధిష్టించారు. మహిళలు పొర్లు దండాలు పెట్టారు. ఈఓ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు రథం లాగి ఊరేగింపు మొదలుపెట్టారు.

## క్లుప్తంగా

### వైభవంగా శివుని పార్వేట ఉత్సవం



శివుని చిత్ర పటాన్ని పార్వేటకు తీసుకెళుతున్న దృశ్యం

**రాప్తాడు:** మండలంలోని ఎం.బండమీదపల్లి గ్రామంలో మంగళవారం శివుడి పార్వేట ఉత్సవం వైభవంగా జరిగింది. ముందుగా సల్లాపురమ్మ అమ్మవారికి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం స్థానిక శివాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, శివుని చిత్రపటాన్ని యర్రగుంట సమీపంలోని శివుని మాన్యంలోకి పార్వేటకు తీసుకెళ్లారు. అక్కడ శివునికి మొక్కులు చెల్లించుకుని, కుందేళ్లను వదిలి పార్వేట నిర్వహించారు. ఇదిలా ఉండగా బుధవారం సల్లాపురమ్మ పార్వేట నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

### పశువుల దాహర్తి తీర్చడానికే నీటి తొట్టెలు



భూమి పూజ చేస్తున్న నియోజకవర్గ ప్రత్యేకాధికారి రామ్మోహన్

**రాప్తాడు:** వేసవిలో పశువుల దాహర్తి తీర్చడానికే నీటి తొట్టెలు నిర్మాణానికి శ్రీకారం చుట్టామని నియోజకవర్గ ప్రత్యేకాధికారి రామ్మోహన్ పేర్కొన్నారు. మంగళవారం హంపాపురంలోని బీసీ బాలుర వసతి గృహం సమీపంలో నీటి తొట్టెల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నాయని, పాడి పశువులు మేపులకు బయటకు వెళ్తే దాహం తీర్చుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి ఇబ్బందుల దృష్ట్యా ప్రభుత్వం నీటి తొట్టెలు మంజూరు చేసిందన్నారు. ఎంపీడీఓ విజయలక్ష్మీ, ఈఓఆర్డీ ఆనంద ప్రసాద్, ఏపీఓ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

### 92 శాతం పింఛన్ పంపిణీ

**అనంతపురం క్రైం:** అనంతపురం జిల్లాలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ మొదటి రోజు 96 శాతం పూర్తయింది. బుధవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పంపిణీ సాయంత్రం 6 గంటల దాకా సాగింది. జిల్లాలో 2,79165 పింఛన్‌దారులుండగా వారికి రూ.123.76 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య తెలిపారు. ప్రతి ఒక్కరికీ పింఛన్‌ను ఇంటి వద్దకే వచ్చి పంపిణీ చేస్తారన్నారు. పింఛన్ రాలేదన్న ఆందోళనతో ఎవరూ కార్యాలయాల వద్దకు వెళ్లొద్దని సూచించారు. మొదటిరోజు 2,55,872 మందికి రూ.1,13,15,96,000 పంపిణీ చేసినట్లు పీడీ వివరించారు.

### హత్యకేసు నిందితులను కఠినంగా శిక్షించండి



సీఐకు వినతిని అందిస్తున్న రాజహంస శ్రీనివాసులు

**రామగిరి:** కురుబ లింగమయ్య హత్య కేసు నిందితులను కఠినంగా శిక్షించాలని కురుబ సంఘం జిల్లా అధ్యక్షులు రాజహంస శ్రీనివాసులు డిమాండ్ చేశారు. పాపిరెడ్డిపల్లిలో గ్రామానికి చెందిన కురుబ లింగమయ్య ఆదివారం దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. మంగళవారం ఆయన కురుబ సంఘం నాయకులతో కలిసి రామగిరి సిఐ శ్రీధర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగమయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడన్నారు. అలాంటి వ్యక్తిని దారుణంగా హతమార్చి రాజకీయాలు అంటగట్టడం సరికాదన్నారు. హత్యా రాజకీయాలకు అమాయకులను బలిచేయొద్దని కోరారు. లింగమయ్య హత్యను కురుబ సంఘం హేయమైన చర్యగా భావిస్తోందన్నారు.

### వైఎస్ జగన్‌తో మేయర్ భేటీ



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన మేయర్ వసీం

**అనంతపురం కార్పొరేషన్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నగర మేయర్ వసీం మంగళవారం బెంగళూరు ఎయిర్‌పోర్టులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేయర్ వసీంతో అధినేత వైఎస్ జగన్ మాట్లాడారు. పార్టీ పటిష్టతకు కృషి చేయాలని మేయర్‌కు సూచించారు.

### భయపడకు తల్లీ.. ఏం కాదులే..!



విద్యార్థిని శ్రావణిని పరామర్శిస్తున్న ఎంపీపీ హేమలత

**ఆత్మకూరు:** భయపడకు తల్లీ నీకు ఎం కాదులే.. మేమందరం ఉన్నామంటూ ఎంపీపీ సుబ్బర హేమలత పదో తరగతి విద్యార్థిని శ్రావణికి ధైర్యం చెప్పారు. గత శనివారం ఆత్మకూరు ఉన్నత పాఠశాలలో పరీక్ష రాసే సమయంలో పరీక్ష కేంద్రం చీఫ్ శ్రీనివాసప్రసాద్ కర్రతో కొట్టగా విద్యార్థినికి కుడి చేయి ఎముక విరిగిన విషయం తెలిసిందే. మంగళవారం శ్రావణితో పాటు మరో 9వ తరగతి విద్యార్థినిని పరీక్షకు అనుమతించి పరీక్ష రాయించారు. ఎంపీపీ స్థానిక కస్తూర్బా పాఠశాలకు వెళ్లి శ్రావణిని పరామర్శించారు. ఇప్పుడు ఆరోగ్యం ఎలా ఉంది తల్లీ.. నొప్పి తగ్గిందా ఏం భయపడకు నువ్వు తప్పకుండా ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధిస్తావ్ అని ధైర్యం చెప్పారు. మరోసారి ఎవరైనా, ఎక్కడైనా విద్యార్థులపై ఇలా కర్రలతో దాడి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అధికారులను కోరారు.

### రూ.6 కోట్ల బిల్లులు వెనక్కు

**అనంతపురం కార్పొరేషన్:** కూటమి ప్రభుత్వంలో అభివృద్ధికి అడ్డంకులు మొదలయ్యాయి. నగరపాలక సంస్థ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి రూ.6 కోట్ల బిల్లుల చెల్లింపులపై నీలినీడలు అలుముకున్నాయి. గత కొన్ని నెలలుగా నగరపాలక సంస్థ పరిధిలో 490 పనులకు సంబంధించి ఏఈ నుంచి కమిషనర్ వరకు అధికారులు బిల్లులు సిద్ధం చేసి సీఎఫ్ఎంఎస్ ద్వారా విజయవాడకు పంపారు. కాగా ఆ బిల్లులన్నీ అక్కడి నుంచి రిటర్న్ చేశారు. మళ్లీ మరోసారి వాటిని తిరిగి పంపాలో..లేక ఇక్కడే ఆ పనులు చేపడుతారో వేచి చూడాల్సి ఉంది.

### ముగిసిన 'పది' పరీక్షలు



పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

**చెన్నేకొత్తపల్లి:** ఏపీ మోడల్‌స్కూల్, జూనియర్ కళాశాలలో గత నెల17న ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు మంగళవారం ముగిశాయి. చివరి రోజు సాంఘిక శాస్త్రం పరీక్ష జరిగింది. మొత్తం 288 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు అధికారులు తెలియజేశారు. పదో తరగతి పరీక్షలు ముగియడంతో విద్యార్థులు సంతోషంలో మునిగిపోయారు.